

సమస్యలు పరిష్కరించకపోతే 26 నుంచి సమ్మె

కమిషనర్‌కు నోటీసు ఇచ్చిన మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - నూజివీడుటౌన్

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ నుండి సమ్మెలోకి వెళ్లనున్నట్లు స్థానిక మున్సిపల్ కార్మికులు కమిషనర్‌కు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు .జిల్లా కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కనీస వేతనం ఇవ్వాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు నష్టం కల్గించే ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు కె.జయలక్ష్మి, పద్మ, రజిని, రాణి, ఏడుకొండలు, గౌరీ పాల్గొన్నారు.

పిటీషన్.. దీక్షలనూ.. పట్టించుకోరు..!



దీక్షల్లో నినదిస్తున్న మర్లగూడెం గిరిజన రైతులు (ఫైల్‌ఫోటో)

'మర్లగూడెంలో రెవెన్యూ అధికారుల తీరుతో ఏర్పడిన భూ సమస్యపై ఐటిడిఎ పిఒ కోర్టులో పిటీషన్ వేసినా ఇంకా స్పందన లేదు. తమ సమస్య పరిష్కరించి భూములపై హక్కు కల్పించాలని తొమ్మిది రోజులుగా ఐటిడిఎ వద్దే దీక్షలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు.. తమ గోడు ఇంకెవరికి చెప్పకోవాలి' అంటూ మర్లగూడెం గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం తమ దీక్షలపై ప్రతిరోజూ ఈ మార్గంలోనే రాకపోకలు సాగించే ఐటిడిఎ పిఒ సైతం స్పందించకపోవడం బాధగా ఉందని వాపోతున్నారు.

ఐటిడిఎ అధికారుల తీరుపై మర్లగూడెం గిరిజన రైతుల ఆవేదన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయగూడెం మండలం మర్లగూడెం రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 39, 40, 41, 43/3ల్లో 36 ఎకరాల ఎల్‌టిఆర్ భూములున్నాయి. ఈ భూములను మర్లగూడేనికి చెందిన 20 గిరిజన కుటుంబాలు గత 25 సంవత్సరాలుగా ఆ భూములను సాగు చేసుకుంటున్నాయి. 1971-73 సంవత్సరాల్లో అడంగల్‌లో గిరిజనేతరులైన తన్నీరు, బండారు కుటుంబీకుల పేరున ఈ బూములు నమోదైనా ఎల్‌టిఆర్ భూములు కావడంతో 20 గిరిజన కుటుంబాలు సాగు చేసుకుంటున్నాయి. దీనిపై 1995లో ఎస్‌డిసి కోర్టు ఈ భూములపై గిరిజనేతరులైన తన్నీరు, బండారు కుటుంబాలకు అనుకూలంగా తీర్పునిచ్చింది. అయితే సంబంధిత కుటుంబీకులు భూముల జోలికి రాకపోవడం, ఎస్‌డిసి కోర్టు తీర్పుపై అవగాహన లేకపోవడంతో గిరిజన రైతులు యథావిధిగా సాగు చేసుకుంటున్నారు. కొంతకాలం క్రితం ఆయా కుటుంబాలకు చెందిన వారు ఆర్‌డిఒ నుంచి ప్రొటెక్షన్ ఆర్డర్ పొంది భూముల్లోకి దౌర్జన్యంగా వచ్చి స్వాధీనం చేసుకున్నారు. ఇదేమిటని గిరిజన రైతులు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం దక్కలేదు. దీంతో వారంతా ఎస్‌డిసి కోర్టులోనే మళ్లీ పిటీషన్ వేశారు. దీన్ని ఎస్‌డిసి కోర్టు స్వీకరించకుండా ఒకసారి తీర్పునిచ్చాక మళ్లీ పిటీషన్ స్వీకరించబోమని తిరస్కరించింది. దీంతో గిరిజన రైతులు ఎస్‌డిసి కోర్టు తీర్పుపై ఐటిడిఎ పిఒ కోర్టులో పిటీషన్ వేశారు. దీనికి ఇంకా నెంబర్ కేటాయించలేదు. దీంతో తమ భూ సమస్య పరిష్కరించాలని గిరిజన రైతులు ఐటిడిఎ కార్యాలయం వద్ద గత తొమ్మిది రోజులుగా నిరాహారదీక్షలు చేస్తున్నారు. తాము ఈ భూములను 25 సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నామని చెబుతున్నారు. ప్రస్తుతం ఈ భూములకు సంబంధించి రికార్డులు, టైటిల్ వెరిఫికేషన్ చేయకుండా ప్రభుత్వం, అధికారులు ప్రొటెక్షన్ ఆర్డర్ ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైగా గిరిజన చట్టాలకు విరుద్ధంగా ఆయా భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అనువుగా తయారు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. తమ పేర్లను రికార్డుల్లో నమోదు చేయాలని ఎన్నిసార్లు అధికారులను వేడుకున్నా పట్టించుకోకపోవడంతో ఇప్పుడు నష్టపోయామని గిరిజన రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

9 రోజులుగా దీక్ష చేస్తున్నా పట్టించుకోరేం

కుర్సం దుర్గారావు, మర్లగూడెం గిరిజన రైతు



9 రోజులుగా దీక్షలు చేస్తున్నా కనీసం అధికారులు పట్టించుకోలేదు. గిరిజనులంటే ఎందుకంత చిన్నచూపు. ఐటిడిఎ మాకు అండగా ఉంటుంది, పిఒ న్యాయం చేస్తారనుకుంటే కనీస స్పందన లేదు. మా సంక్షేమం ఏర్పాటు చేసిన ఐటిడిఎల వల్ల ఇంకేం ఉపయోగం. కనీసం మమ్మల్ని మనుషులుగా చూడకపోవడం బాధాకరం.

రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నా పట్టడం లేదు

మడకం వెంకటేశ్వరరావు, గిరిజన రైతు, మర్లగూడెం



మా సాగులో 25 సంవత్సరాలుగా ఉన్న భూములను అన్యాయంగా లాక్కొని గిరిజనేతరులకు కట్టబెట్టడం అన్యాయం. దీంతో 20 కుటుంబాలు రోడ్డున పడ్డాయి. గిరిజన చట్టం ప్రకారం ఏజెన్సీ భూములలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయకూడదు. అయితే దానికి భిన్నంగా రోడ్లు వేసి డ్రెయినేజీలు తవ్వారు. దీనిపై అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడం దారుణం. ఇప్పటికైనా ఐటిడిఎ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

మా బతుకులు బాగుజేయండి

మడకం శంకురమ్మ, మర్లగూడెం గిరిజన రైతు




ఐటిడిఎ పిఒ మాకు న్యాయం చేస్తారని తొమ్మిది రోజులుగా ఇక్కడ దీక్షలు చేస్తున్నాం. అయినా ఆయనకు మా సమస్య పట్టకపోవడం బాధగా ఉంది. తొమ్మిది రోజులుగా ఇక్కడ నిరాహార దీక్ష చేస్తున్నా ఒక్క అధికారీ మీ సమస్య ఏమిటని అడిగిన పరిస్థితి లేదు. ఐటిడిఎ కార్యాలయానికి కొత్త రంగులు వేయడం కాదు.. గిరిజనుల సమస్యలను పరిష్కరించి మా బతుకులు బాగుచేస్తే ఐటిడిఎల ఏర్పాటు ఉద్దేశం కొంతైనా నెరవేరే అవకాశం ఉంటుంది.

పెద్ద జబ్బులకూ ఆరోగ్యశ్రీలో చికిత్స

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

పెద్ద జబ్బులకు సైతం ఒక పైసా ఖర్చు లేకుండా నిశ్చింతగా వైద్య సేవలను అందించడంలో డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ఆపన్నహస్తంగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా సుమారు 6,33,227 లక్షల కుటుంబాలకు ఆరోగ్యశ్రీ కార్డులు ఉన్నాయని, వీరికి తొమ్మిది జిల్లా, ఏరియా, సిహెచ్‌సిలు, 36 ప్రయివేట్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా చికిత్సలు అందుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నవంబరు 30 వరకు రూ.37.69 కోట్ల విలువైన సర్జరీలు, థెరపీల ద్వారా 16,407 ఆరోగ్యశ్రీ సేవలు అందించారని తెలిపారు. అదే విధంగా రూ.వెయ్యికి పైబడి ఆరోగ్యశ్రీ చికిత్స కింద 22,755 మంది రూ.55.92 కోట్లు విలువైన వైద్యాన్ని ఉచితంగా పొందారని పేర్కొన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కింద వివిధ శస్త్ర చికిత్సలు, ఇతర వైద్యం పొంది ఆసుపత్రుల నుండి ఇంటికి వెళ్లిన రోగులకు ఆపరేటివ్ సస్టేన్స్ అలవెన్స్ కింద ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నవంబరు వరకు 10,587 మందికి రూ.5.97 కోట్లు వైఎస్ఆర్ ఆరోగ్య ఆసరా కింద అందజేశామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఆరోగ్యశ్రీ కింద వైద్యానికి అయ్యే వ్యయాన్ని ఏడాదికి ఒక కుటుంబానికి రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచిందని, అదేవిధంగా 3,257 వ్యాధులకు చికిత్స అందించేలా చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ సేవలను సులభంగా పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతన కార్డులను అందిస్తుందని తెలిపారు. ఆరోగ్యశ్రీ యాప్‌ను ప్రతి ఇంటిలో కనీసం ఒకరి ఫోన్‌లోనైనా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అదే విధంగా మహిళల భద్రతకు సంబంధించి దిశ యాప్‌ను కూడా డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. జిల్లాలో జనవరి ఒకటో తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశ కార్యక్రమం ప్రారంభిస్తారని పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ, అర్బన్ ప్రాంతాల్లో శిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు.



జంగారెడ్డిగూడెంలో..

భూహక్కు చట్టం రద్దు కోరుతూ న్యాయవాదుల రిలే దీక్షలు

ప్రజాశక్తి - భీమడోలు

స్థిరాస్తుల వ్యవ హారంలో వివాదాలు ఏర్పడినప్పుడు వాటి పరిష్కారాన్ని సివిల్ కోర్టు పరిధి నుంచి తప్పించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి ట్రిబ్యునల్‌కు అప్పగించేందుకు ఏర్పాటు చేసిన భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ భీమడోలు బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన న్యాయవాదులు మంగళవారం భీమడోలు కోర్టు ఆవరణలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ లోపభూయిష్టమైన భూహక్కు చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం వల్ల సన్న, చిన్నకారు, దళిత, బడుగు బలహీన వర్గాలకు నష్టం జరుగుతుందని ఆరోపించారు. కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కాలి నాగేశ్వర రావు, బి.రాంబాబు నాయకత్వం వహించారు.

జంగారెడ్డిగూడెం: ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేయాలని కోరుతూ జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. మంగళవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో చేపట్టిన దీక్షల్లో న్యాయవాదులు పిఎస్ఆర్‌కె.లక్ష్మణరావు, పాములపాటి వెంకటకృష్ణారెడ్డి, పిల్లి పెద్దిరాజు, కాకి జెన్నీ పాల్గొన్నారు. జనసేన నేతలకు దీక్షలకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు తల్లాడి అశోక్‌కుమార్, కార్యదర్శి ఎవివి.భువనేశ్వరి, మానికల సూరిబాబు, టిఎస్ఎన్.మూర్తి, ఎన్‌విబిఎల్.ఆచారి, ముళ్లపూడి శ్రీనివాసరావు, జివివిఆర్.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



భీమడోలులో..

పిల్లలు తక్కువ.. పర్యవేక్షణ అధికారులు, సిబ్బంది ఎక్కువ

అంగన్వాడీ కేంద్రాల నిర్వహణలో ప్రభుత్వ తీరుపై జనం విస్మయం

ప్రజాశక్తి - భీమడోలు

రాష్ట్ర ప్రభుత్వ తీరుతో 'కేంద్రాలకు వచ్చే పిల్లలేమో చాలా తక్కువ. పర్యవేక్షణాధికారుల సంఖ్య ఎక్కువ' అన్నట్లు తయారైంది అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి. ఇదేం చోద్యం అంటూ ఆయా కేంద్రాల పరిధిలోని అంగన్వాడీ లబ్ధిదారులు, గ్రామస్తులు సైతం ముక్కున వేలేసుకుంటున్నారు. ఐసిడిఎస్ పీడీ పద్మావతి మండలంలో మంగళవారం పర్యటించారు. దీనిలో భాగంగా అధికారుల ఒత్తిడితో కేంద్రాలు తెరిచినా పిల్లలు రాని కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల నిర్వహణపై గ్రామ సచివాలయ సిబ్బంది, డ్వాక్రా. మహిళలకు పలు సూచనలు చేశారు. ఆమె వెంట సిడిపిఒ ఎంఎస్.రాజశేఖర్, క్లస్టర్ సూపర్‌వైజర్ నూర్జహాన్, గ్రామ రెవెన్యూ అధికారులు ఇంతియాఫ్. నాగేశ్వరరావుతోపాటు గ్రామ పంచాయతీ అధికారులు ఉన్నారు. అంగన్వాడీ కేంద్రానికి హాజరైన విద్యార్థులు కంటే తనిఖీలకు వచ్చిన అధికారుల సంఖ్య ఎక్కువగా ఉండటం సర్వత్రా చర్చనీయాంశమైంది.


పిల్లలేని అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ పీడీ


ఏలూరులో అంగన్వాడీల భిక్షాటన

అదే హోరు.. అదే జోరు

8వ రోజు కొనసాగిన అంగన్వాడీల సమ్మె - ప్రభుత్వ తీరును నిరసిస్తూ భిక్షాటన, వంటావార్పు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తమకు గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన అంగన్వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారం ఎనిమిదో రోజు కొనసాగింది. ఈ నేపథ్యంలో నగరంలో భిక్షాటన చేసి వినూత్నరీతిలో నిరసన తెలిపారు. ఏలూరు కలెక్టరేట్ వద్ద ఉన్న ధర్నా శిబిరం నుంచి నుండి స్టేట్‌బ్యాంకు, డిఇఒ ఆఫీస్, ఫైర్‌స్టేషన్ సెంటర్, జిల్లా పరిషత్ కార్యాలయం, కొత్త బస్టాండ్, జన్మభూమి పార్క్ మీదుగా తిరిగి కలెక్టరేట్ వరకు భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వి.సాయిబాబు మాట్లాడగా యూనియన్ అధ్యక్షులు టి.రజిని, సెక్టార్ లీడర్లు అరుణకుమారిరెడ్డి, రామలక్ష్మి, స్వప్న, నవతి, సిఐటియు నగర అధ్యక్షుడు బి.జగన్నాథరావు పాల్గొన్నారు. అంగన్వాడీల ఆందోళనకు పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి నాని సంఘీభావం తెలిపారు.

చింతలపూడి: అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని మాలమహాసేన జాతీయ అధ్యక్షులు అలగ రవికుమార్ అన్నారు. పట్టణంలో ఫైర్‌స్టేషన్ వద్ద అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని ఆయన మంగళవారం సందర్శించి మద్దతు తెలిపారు. అంగన్వాడీలు తమ ఆందోళనలో భాగంగా పట్టణంలో భిక్షాటన నిర్వహించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ, ప్రాజెక్ట్ అధ్యక్షులు సరోజిని, కార్యదర్శి మాణిక్యం పాల్గొన్నారు.

చాట్రాయి: అంగన్వాడీలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎనిమిదో రోజు ఆందోళన కొనసాగించారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని నినదించారు.

టి.నరసాపురం: అంగన్వాడీలు స్థానిక సెంటర్లో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని నినదించారు.

కొయ్యలగూడెం: అంగన్వాడీలు మండల కేంద్రంలో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ అంగన్వాడీలు కోరుతున్నవి గొంతెమ్మ కోర్కెలేమీ కాదని, నాడు ప్రతిపక్ష నేతగా జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలనే కోరుతున్నారని తెలిపారు. ప్రభుత్వం అత్యంత నిరంకుశత్వంగా వ్యవహరించడం దారుణమన్నారు. ఈ ఆందోళనకు జనసేన నేత చిర్రి బాలరాజు, నేతలు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి శుక్లబోయిన రాంబాబు, అంగన్వాడీ ప్రాజెక్ట్ అధ్యక్షులు శివ రత్నకుమారి, పి.పద్మజ, జె.నాగవేణి, అడపా నాగజ్యోతి, సిహెచ్.సునీతరాయల్, బొబ్బిలి చిట్టి, కె.జ్యోతి, కె.మాధవి, పి.భాగ్యలక్ష్మి, ఎం.వెంకటలక్ష్మి, ఎం.మంగ, శ్రీదేవి, నూర్జహాన్ పాల్గొన్నారు.

నిడమర్రు: అంగన్వాడీల సమ్మెకు టిడిపి బిసి సెల్ అధ్యక్షులు


ముసునూరులో వంటావార్పు

నీకూరి ఆశీర్వాదం సంఘీభావం తెలిపారు. అనంతరం అంగన్వాడీలు భిక్షాటన చేపట్టి నిరసన తెలిపారు. కార్యక్రమంలో కె.జయమ్మ, ఎన్.పార్వతి, సుభాషిణి, సత్యవేణి, ఈశ్వరి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: అంగన్వాడీలు స్థానిక సెంటర్లో జాతీయ రహదారిపై భిక్షాటన చేసి ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. అంగన్వాడీల సమ్మెకు సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, సిఐటియు జిల్లా నేత మొడియం నాగమని, మండల కార్యదర్శి కొండలరావు, నేత అప్పారావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీలు నాగమణి, ఎస్తేరు, సరళ, జ్యోత్స్న పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: అంగన్వాడీల సమ్మె ఎనిమిదో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ అంగన్వాడీలకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలని, లబ్ధిదారులకు నాణ్యమైన సరుకులు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణాధ్యక్షులు ఎన్ఆర్.హనుమాన్, అంగన్వాడీ నేతలు పద్మ, వసుంధర, ఝాన్సీ, జ్యోతి, మణి, రమాదేవి పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: అంగన్వాడీ ఉద్యమాన్ని అణచివేయాలని చూడటం అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపడం వంటిదేనని ప్రజాసంఘాల ధర్నాలో వక్తలు అన్నారు. అంగన్వాడీల సమ్మెను పరిష్కరించాలని కోరుతూ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు రాష్ట్ర కమిటీ సభ్యులు సరియం రామ్మోహన్ అధ్యక్షతన జరిగిన సభలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.బుచ్చిబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేకా ఈశ్వరయ్య, సిపిఎం నాయకులు చల్లారి మాణిక్యాలరావు, కాంగ్రెస్ నాయకులు ముప్పిడి శ్రీను, ఐఎఫ్‌టియు నాయకులు కెవి.రమణ మాట్లాడారు. అనంతరం ఆర్‌డిఒ అద్దయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అలివేరు సర్పంచి కారం అరుణ, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఇ.భూషణం, ఆయా సంఘాల, పార్టీల నేతలు వెట్టి సుబ్బన్న, కారం రాఘవ, వలవల తాతాజీ, ఆకుల రాకేష్, షేక్ పీరు, చింతల నాని, రమణరాజు, బాలఏసు, కుంచే వసంతరావు, విఘ్నేష్, వెట్టి భారతి, పి.లత, కె.రామలక్ష్మి, బన్నే వినోద్, తగరం బాబూరావు, నడపల మక్కారెడ్డి, బాలిన ధర్మరాజు, వి.శిరోమణి, కాశీ సోమేశ్వరరావు, ప్రసాద్, ఎం.శ్యామ్ పాల్గొన్నారు.

మండవల్లి: అంగన్వాడీల సమ్మె ఎనిమిదో రోజు కొనసాగింది. స్థానిక తహశీల్దార్ కార్యాలయ ప్రాంతంలో అంగన్వాడీలు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నేతలు చల్లమ్మ, విజయలక్ష్మి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: అంగన్వాడీల సమ్మెలో భాగంగా ఆగిరిపల్లిలో మంగళవారం భిక్షాటన చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో అన్నమ్మ, అనూరాధ, పుల్లమ్మ, కరుణ, రూప, జ్యోతి, రాజ్యలక్ష్మి, సిపిఎం మండల కార్యదర్శి నాగరాజు, నేత కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉంగుటూరు: అంగన్వాడీల సమ్మెకు భవన నిర్మాణ కార్మిక సంఘం నేత గనుమోజు వెంకటరమణ సంఘీభావం తెలిపారు. ఉంగుటూరులో సమ్మె శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడుతూ రాత్రివేళల్లో దొంగచాటుగా అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పగులగొట్టడంపై ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు.

ముసునూరు: అంగన్వాడీలపై వైసిపి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు వీడి సమస్యలు పరిష్కరించాలని ప్రాజెక్టు కార్యదర్శి పల్లిపాము రాజకుమారి కోరారు. స్థానిక గ్రామసచివాలయం వద్ద అంగన్వాడీలు మంగళవారం వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు.

భీమడోలు: అంగన్వాడీల నిరవధిక సమ్మె ఎనిమిదో రోజు మంగళవారం కొనసాగింది. సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు సందర్శించి మాట్లాడారు. అనంతరం అంగన్వాడీలు రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ భిక్షాటన చేపట్టారు. కార్యక్రమానికి యూనియన్ నాయకులు స్వర్ణకుమారి, చల్లా మణి నాయకత్వం వహించారు.

బుట్టాయగూడెం: సిఐటియు, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా వారు జోలె పట్టి భిక్షాటన చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో కృపామణి, పుష్ప, రామలక్ష్మి, నూర్జహాన్, మున్ని, పార్వతి, నిర్మల, భూదేవి పాల్గొన్నారు.

కలిదిండి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద అంగన్వాడీల సమ్మె శిబిరం ఎనిమిదో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్వాడీలు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. తమ కేంద్రాల తాళాలు బద్దలుకొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమ్మెకు ఒబిసి నాయకులు లావేటి వీరశివాజీ మద్దతు తెలిపారు. కార్యక్రమానికి షేక్ అబిదా బేగం, జక్కంశెట్టి మేనక లక్ష్మి, కొప్పినీడి రమాదేవి నాయకత్వం వహించారు.

పోలవరం: అంగన్వాడీలు మంగళవారం పోలవరంలో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పిఎల్ఎస్.కుమారి, అంగన్వాడీలు పాల్గొన్నారు.


అస్వస్థతకు గురైన నాగమణిని 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలింపు

అంగన్వాడీ కార్యకర్తకు తీవ్ర అస్వస్థత

ప్రజాశక్తి - ముసునూరు

గత ఎన్నికల సందర్భంగా సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ అంగన్వాడీలు ఎనిమిది రోజులుగా సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రభుత్వం సమ్మెను పరిష్కరించకుండా కేంద్రాల తాళాలు పగులగొట్టించి భయభ్రాంతులకు గురిచేస్తుండటంతో అంగన్వాడీలు తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారు. ఇదే తరహాలో ముసునూరులో సమ్మె శిబిరం వద్ద ఆందోళనలో పాల్గొంటున్న వేల్పుచర్ల శివారు అన్నవనేనివారిగూడేనికి చెందిన అంగన్వాడీ కార్యకర్త నాగమణి ఒక్కసారిగా నీరసపడి అస్వస్థతకు గురయ్యారు. వాంతులు కావడంతో సహచర అంగన్వాడీలు ఆమెను హుటాహుటీన స్థానిక పిహెచ్‌సికి తరలించారు. అయితే ఆమెకు బిపి బాగా ఎక్కువగా ఉన్నట్లు గుర్తించి మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు తరలించారు. అయితే నాగమణి ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రభుత్వ మొండివైఖరి, సచివాలయ, రెవెన్యూ సిబ్బందిని ఉసిగొల్పి భయభ్రాంతులకు గురిచేయడంతో రెండు రోజులుగా నాగమణి ఆందోళనకు గురవుతుందని, ప్రభుత్వ తీరుతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె తీవ్ర అస్వస్థతకు గురైందని, ఆమెకు ఏం జరిగినా ప్రభుత్వానిదే బాధ్యతని సహచర అంగన్వాడీలు హెచ్చరించారు.


జీలుగుమిల్లిలో..


నూజివీడులో..



కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెల్పుతున్న ఉద్యోగులు

సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నేటి నుంచి నిరవధిక సమ్మె

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

విద్యాశాఖ సమగ్ర శిక్ష ప్రాజెక్టులో పని చేస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పెన్డౌన్ కార్యక్రమం మంగళవారం చేపట్టారు. ఈనెల 20వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్న నేపథ్యంలో బుట్టాయగూడెం మండల ఉద్యోగులు స్థానిక ఎంఇఒ కార్యాలయం ఎదుట నల్లరిబ్బన్లు కళ్లకు కట్టుకొని వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

పథకాల సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - భీమడోలు

ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పెట్టిన పథకాల సేవలను వినియోగించుకోవాలని పోలసానిపల్లి గ్రామ సర్పంచి షేక్ రహీమా బేగం హసేన కోరారు. పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిటిసి ఎ.దేవి నాగేంద్ర ప్రసాద్‌తో పాటు పాల్గొన్న సర్పంచి ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ నూతన కార్డుల అంశాల గురించి వివరించి, అవగాహన కల్పించారు. సేవలు వినియోగించుకునే తీరుతెన్నుల గురించి తెలియజేశారు. అనంతరం ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరైన లబ్ధిదారులకు వాటి పంపిణీ కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం వారు రెండవ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా 'ఎపికి జగనే ఎందుకు కావాలి' అనే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికి వెళ్లారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టి, అమలు చేస్తున్న పలు పథకాలు, ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలు, ఇతర అంశాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచి కోట శ్రీనివాసరావుతో పాటు గ్రామపంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షన్లు పెంచాలి : సిపిఐ

ప్రజాశక్తి - చింతలపూడి

పెరిగిన ధరల రీత్యా సామాజిక పెన్షన్లు రూ.6 వేలకు, వికలాంగుల పెన్షన్ రూ.10 వేలకు పెంచాలని సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య డిమాండ్ చేశారు. మండలంలో పెన్షన్లు పెంచాలని సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో రేచర్ల గ్రామంలో సంతకాల సేకరణ చేసి అనంతరం సచివాలయంలో వినతిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం అన్ని రాజకీయ పార్టీలు తమ తమ మేనిఫెస్టోలో ఈ అంశాన్ని చేర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కమిటీ సభ్యులు దంతా కష్ణ శాఖ కార్యదర్శి విస్తరాకుల వెంకటేశ్వరరావు ఎస్ కే బడేషా కలగొట్ల వెంకటేశ్వరరావు జోన బోయిన పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఊటుకూరులో 'వై ఎపి నీడ్స్ జగన్'

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని ఉటుకూరులో మంగళవారం వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ వైసిపి నాయకులతో కలిసి సంక్షేమ పథకాల ప్రదర్శన బోర్డును ఆవిష్కరించి, జెండాను ఎగుర వేసి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మొట్రూ ఏసుబాబు, రాష్ట్ర బిసి నాయకులు కోమటి విష్ణువర్ధన్, పత్తి శ్రీను, రామకృష్ణ, బేతు రాజా, సాయిరాం పాల్గొన్నారు.

ఉపాధి హామీ మేట్లకు శిక్షణ

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని స్థానిక వెలుగు కార్యాలయంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంకు సంబంధించిన మేట్లకు మంగళవారం, బుధవారం రెండు రోజులు శిక్షణా కార్యక్రమం పోలవరం ఎంపిడిఒ జి.శ్రీను ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఎపిఒ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి పాల్గొన్నారు. విధి నిర్వహణలో ఏవిధమైన అవకతవకలకు తావు లేకుండా విధులు నిర్వహించాలని ఎంపిపి సూచించారు. మేట్లు మరింత మెరుగ్గా విధులు నిర్వహించేందుకు ఈ శిక్షణ దోహదపడతాదని ఎంపిడిఒ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒసిహెచ్ శ్రీనివాస్ బాబు, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, జెఇ లీలా భరత్, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మూడో రోజుకు షష్ఠి ఉత్సవాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

జిల్లా ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన మండలంలోని సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో వేంచేసియున్న శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి షష్ఠి కల్యాణ మహోత్సవాలు మంగళవారంతో మూడోరోజుకు చేరాయి. ఈ సందర్భంగా భక్తజనం పెద్ద ఎత్తున దేవస్థానానికి చేరుకొని స్వామివారిని దర్శించుకుని, ఆలయ ప్రాంగణంలో ఉన్న పుట్టలో పాలు పోశారు. పుట్ట వద్ద భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు, పోలీసులు తగిన చర్యలు చేపట్టారు. అలాగే ఆలయం భీమవరం -విజయవాడ మార్గంలో ఉండడంతో సింగరాయపాలెం సెంటర్‌లో భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు పర్యవేక్షించారు. షష్ఠి సందర్భంగా వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆర్‌టిసి ప్రత్యేక బస్ సర్వీస్ నడిపింది. పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకుని పుట్టలో పాలు పోశారు.

విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన

ప్రజాశక్తి - ఉంగుటూరు


నారాయణపురం ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజి విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సులను ఏలూరు ఆర్‌డిఒ, ఉంగుటూరు నియోజకవర్గ ఓటు నమోదు అధికారి ఎస్‌కెఎన్.ఖాజావలి నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుపై విద్యార్థులకు వివరించారు. యువత ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో నోడల్ అధికారి, హౌసింగ్ జిల్లా పీడీ రవికుమార్, ఉంగుటూరు తహశీల్దారు రమణారావు, ఎన్నికల డిటి పోతురాజు, ఉభయ కాలేజీల ప్రిన్సిపల్స్ టికె.విశ్వేశ్వరరావు, బివి.శ్రీనివాస్, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

'యువగళం'తో ప్రజలందరిలో మార్పు

టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు మేఘలాదేవి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

యువగళం పాదయాత్రతో రాష్ట్ర ప్రజలందరిలో మార్పు మొదలైందని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి పేర్కొన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర విజయవంతంగా పూర్తి అవుతుందని ఆమె అన్నారు. పాదయాత్రలో లోకేష్ ప్రతి సమస్యను విన్నారని, యువగళం పాదయాత్రతో రాష్ట్రంలో మార్పు మొదలైందన్నారు. రానున్న 2024 అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి ప్రభుత్వం తప్పనిసరిగా అధికారంలోకి వస్తుందని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా మరలా నారా చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తారని ఆమె అన్నారు. లోకేష్ చేస్తున్న పాదయాత్రలో తాను కూడా పాల్గొని నియోజకవర్గ స్థితిగతులను, మహిళల రక్షణ కోసం ప్రత్యేక దృష్టి సారించాలని ఆయనకు తెలిపినట్లు ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న వైసిపి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిలో విఫలం చెందిందన్నారు. టిడిపి ప్రవేశపెట్టిన మేనిఫెస్టో ద్వారా రాష్ట్ర ప్రజలందరికీ మేలు చేకూరుతుందని మేఘలాదేవి పేర్కొన్నారు.




యువగళం ముగింపులో లోకేష్, మేఘలాదేవి

సంక్షేమాభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్‌ఎ బాలరాజు

ప్రజాశక్తి - టి.నరసాపురం

సంక్షేమాభివృద్ధి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమని పోలవరం నియోజకవర్గ ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని కేతవరం గ్రామ పంచాయతీలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముందుగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్, రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అంబేద్కర్ నగర్‌లో పంచాయతీ బోరు వేయడానికి, అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి 10 సెంట్లు స్థలం ఇచ్చిన దాత గంటా మనోహర్ రావును ఘనంగా సన్మానించి, డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. డాక్టర్ శ్రీనివాసరావు ఇంటి వద్ద సీసీ రోడ్డుకు, బర్రెవారిగూడెం కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అతి త్వరలోనే వైఎస్ఆర్ జలకళ పథకంలో బోర్లు వేస్తామన్నారు. అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ అభివృద్ధి పథకాలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గం పరిశీలకులు వెజ్జు వెంకటేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు, వైసిపి మండల కన్వీనర్ శ్రీనురాజు, వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షులు వాసిరెడ్డి మధు, సర్పంచి తడికలపూడి శివ మాధవి పాల్గొన్నారు.



టి.నరసాపురం: గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్‌ఎ

భీమడోలు : ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు మంగళవారం సాయంత్రం గుండుగొలను గ్రామ సచివాలయం-మూడు పరిధిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం నేటితో 244వ రోజుకు చేరిందని గ్రామ ఉపసర్పంచి ముదుండి సూర్యనారాయణ రాజు తెలిపారు. తొలుత వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఎంఎల్‌ఎ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. వారికి అందుతున్న పథకాలు గురించి వివరించారు. అర్హులు ఎవరైనా లబ్ధి పొందకపోతే తన దృష్టికి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కె.లక్ష్మి, ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రముఖులు హాజరయ్యారు.


మిచౌంగ్ తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతుల జాబితా ప్రదర్శన

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలో మిచౌంగ్ తుపాను ప్రభావంతో సుమారు 1,246 ఎకరాల్లో పలు రకాల పంటల నష్టం వాటిల్లిందని మండల వ్యవసాయ శాఖ అధికారి డి.ముత్యాలరావు తెలిపారు. మంగళవారం మండలంలోని రైతు భరోసా కేంద్రాలలో, సచివాలయాలలో పంటనష్టం వివరాలను ప్రదర్శనకు ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో తుపాను కారణంగా వేరుశనగ, పొగాకు, ప్రత్తి పంటలు నష్టపోవడం జరిగిందన్నారు. పంట దెబ్బతిన్న రైతుల పంటనష్టం వివరాలను ఆయా గ్రామాల్లోని వ్యవసాయ, రెవెన్యు పంచాయతీరాజ్ శాఖల అధికారులు గ్రామాల వారిగా తయారు చేశారన్నారు. పంట నష్టం వివరాలు రైతు భరోసా, సచివాలయాలలో ప్రదర్శనకు ఉంచామని తెలిపారు. పంటనష్టం వివరాలు వరి 422 మంది రైతులకు 293 ఎకరాలు, మొక్కజొన్న 507 మంది రైతులకు 441 ఎకరాలు, పొగాకు 342 మంది రైతులకు 388 ఎకరాలు, వేరుశనగ 116 మంది రైతులకు 118 ఎకరాలు, పత్తి 5 మందికి 6 ఎకరాల్లో మొత్తం 1,392 మంది రైతులకు గాను 1,246 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని తెలిపారు. ఆయా రైతు భరోసా, సచివాలయాలలో ప్రదర్శనకు ఉంచిన వివరాల్లో మార్పులు, చేర్పులు ఉంటే సంప్రదించాలన్నారు.

చింతలపూడి : 18 నుంచి 22వ తేదీ వరకు నష్టపరిహారం జాబితా ఆర్‌బికెల్లో పెడుతున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఎ.మీనాకూమరి తెలిపారు. ఒక ప్రకటనలో ఆమె తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 22వ తేదీన మార్పులు, చేర్పులు ఉంటే రైతులు తెలియజేయాలని కోరారు. కమిటీ వారు రైతులు వారి పొలాలను పరిశీలించి 23 నాటికి నష్టపరిహారం జాబితాను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తారని తెలిపారు. రబీలో వేసుకున్న పంటలు మొక్కజొన్న, పొగాకు, వేరుశనగా మొదలైనవి ఇ-క్రాప్ నమోదు చేసిన తరవాత పంటనష్టం నమోదు చేయటం కుదురుతుందన్నారు. రైతులందరూ ఇ-క్రాప్ చేయించుకోవాలని కోరారు.

పోలవరం : మండలంలోని కొత్త పట్టిసీమ, గూటాల, పోలవరం, పట్టిసీమ గ్రామాల్లో మంగళవారం రైతు భరోసా కేంద్రాల్లో మిచౌంగ్ తూపాన్ వల్ల నష్టపోయిన రైతుల లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించడం జరిగింది. కావున మండలంలోని రైతులందరూ లిస్టును చెక్ చేసుకుని ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 22వ తేదీ లోపు ఫిర్యాదులు అందజేయాలని మండల వ్యవసాయ అధికారి కె.రాంబాబు తెలిపారు. ఫిర్యాదులు అందిన తర్వాత విలేజ్ లెవెల్ కమిటీ క్షేత్ర క్షేత్రస్థాయిలో పరిశీలించి ఫిర్యాదులను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.రాంబాబు, ఎంపిడిఒ జి.శ్రీను, డిప్యూటీ తహశీల్దార్ ప్రసాదు, కొత్త పట్టిసీమ సీనియర్ నాయకులు మైగాపుల దుర్గాప్రసాద్, పూడి వెంకట్రావు పాల్గొన్నారు.



పోలవరం : ఆర్‌బికెలో ప్రదర్శించిన రైతుల జాబిత

దర్భగూడెంలో కుట్టుశిక్షణా కేంద్రం ప్రారంభం



కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించిన ఉషారాణి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

గ్రామీణ ప్రాంత మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాలు ఎంతగానో దోహద పడతాయని సర్పంచి సున్నం ఉషారాణి తెలిపారు. మండలంలోని దర్భగూడెం గ్రామంలో తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఆమె చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుట్టుమిషన్ శిక్షణ పొందడం ద్వారా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఏర్పడుతుందని ఆమె అన్నారు. మూడు నెలల పాటు నిర్వహించే ఈ ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రతి మహిళా సద్వినియోగం చేసుకొని, ఆర్థికాభివృద్ధి దిశగా అడుగులు వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు సున్నం సురేష్, కంచర్ల సుధారాణి, పాండు, లక్ష్మణరావు, బాలాజీ, సాయి సింగ్ తివారి, మధు శివ గణేష్ పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

సహకార కేంద్ర బ్యాంక్ బ్రాంచి మేనేజర్ రాజులపాటి సత్యనారాయణ

ప్రజాశక్తి - మండవల్లి

సహకార కేంద్ర బ్యాంక్ అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని బ్రాంచి మేనేజర్ రాజులపాటి సత్యనారాయణ తెలిపారు. మండలంలోని మోకాస కలవపూడి గ్రామంలో కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు వారి ఆధ్వర్యంలో ఛైర్మన్ తాతినేని పద్మావతి సిఇఒ శ్యాం మనోహర్ ఆదేశాల ప్రకారం నాబార్డ్ వారి సౌజన్యతో జరుగుతున్న డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతపై మోకాస కలవపూడిలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కేంద్ర సహకార బ్యాంకులో తప్పనిసరిగా ఖాతా కలిగి ఉండాలని అన్నారు. పొదుపు ఖాతా తెరిచి ఉంచడం వల్ల ఎన్నో లాభాలు పొందవచ్చన్నారు. అనంతరం ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు, నగదు రహిత లావాదేవీలు ఎటిఎం రూపే, డెబిట్ కార్డు వాడటం వల్ల కలిగే లాభాలు తదితర అంశాలపై కళాజాత బృందం వారు రైతులు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ పరుచూరి శ్రీకాంత్, సొసైటీ ప్రెసిడెంట్ గుడివాడ వెంకట సత్య రాజేంద్ర వరప్రసాద్, సెక్రెటరీ కంచర్ల రాజేష్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



అవగాహనా కల్పిస్తున్న సత్యనారాయణ

వస్తు కొనుగోలుపై అవగాహనుండాలి

సీనియర్ న్యాయవాది కట్టా సత్యనారాయణ

ప్రజాశక్తి - దెందులూరు

విద్యార్థిస్థాయి నుంచి వస్తు కొనుగోలు వ్యవహారాలలో అవగాహన కలిగి ఉండాలని కొవ్వలి వినియోగదారుల సేవా మండలి ప్రెసిడెంట్, సీనియర్ న్యాయవాది కట్టా సత్యనారాయణ తెలిపారు. కొవ్వలి వినియోగదారుల సేవామండలి ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ మంగళవారం 3 గంటలకు సత్రంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ వినియోగదారుల వారోత్సవాలలో భాగంగా వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై వినియోగదారుల చట్టం-2019పై హెడ్మాస్టర్ కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సత్యనారాయణ మాట్లాడుతూ వస్తు సేవలు కొనుగోలు చేసిన సందర్భంలో వినియోగదారుడిగా నష్టపోతే వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్స్‌లో ఫిర్యాదు చేసి వస్తు సేవల ధరలు తిరిగి పొందవచ్చునని, అలాగే నష్టపరిహారం కూడా పొందవచ్చునని, వినియోగదారుల వివాదాల పరిష్కారంకై వినియోగదారుల చట్టం 2019 ప్రకారం జిల్లాస్థాయిలో, రాష్ట్రస్థాయిలో, జాతీయస్థాయిలో కమిషన్స్ వినియోగదారుల చట్టం ప్రకారం ఏర్పాటు చేయబడ్డాయని తెలిపారు. ఉపాధ్యాయులు టి.ప్రకాష్ మాట్లాడుతూ కల్తీ వస్తువులను కొనుగోలు చేసి వినియోగించడం వల్ల ఆరోగ్యం పాడవుతుందన్నారు. అనంతరం స్కూల్ పరిసర ప్రాంత వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సదస్సులో వినియోగదారుల ఉద్యమ ప్రతినిధులు, స్కూల్ ఉపాధ్యాయులు ఎన్.శ్రీనివాసరావు, టి.శ్రీనివాసరావు, వి.పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్సులు తిరగక ప్రయాణికుల అవస్థలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి ఆర్‌టిసి బస్టాండ్‌కు మంగళవారం గుడివాడ డిపోకు చెందిన బస్సులు రాకపోవడంతో ఇటు విద్యార్థులు, అటు ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. దీంతో విషయం తెలియక విద్యార్థులు, ప్రయాణికులు గంటల తరబడి బస్సుల కోసం వేచి చూశారు. ఎంతసేపటికి బస్సులు జాడ లేకపోవడంతో చేసేదిలేక ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గుడివాడ, కైకలూరు, గుడ్లవల్లేరు, బంటుమిల్లి, కోరుకొల్లు వైపు వెళ్లే ప్రయాణికులు, వివిధ కళాశాలలకు వెళ్లే విద్యార్థులు అధిక చార్జీ చెల్లించి ఆటోలను ఆశ్రయించారు. బస్సులు తిరగపోవడంతో ఆటోవాలాలు ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేశారు. చేసేదిలేక ప్రయాణికులు అధిక చార్జీలు చెల్లించి ఆటోల్లో ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. బస్సులు తిరగక పోవడంతో పాసులు ఉన్న విద్యార్థులు కళాశాలలకు వెళ్లకుండా ఇంటి మొహం పెట్టారు. మధ్యాహ్నం నుంచి తిరిగి గుడివాడ డిపో నుంచి బస్సులు ముదినేపల్లి వైపు రాకపోకలు ప్రారంభంకావడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. గుడివాడ డిపో వద్ద అద్దె బస్సులు నడిపే డ్రైవర్లకు, ఆర్‌టిసి సిబ్బందికి తలెత్తిన వివాదం వల్ల బస్సు ఆగినట్లు సమాచారం.

హైదరాబాద్‌లో డిఎస్‌పి నాగేంద్రరావు మృతి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

హైదరాబాద్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఐటీ కోర్ డిఎస్‌పిగా పనిచేస్తున్న మండల పరిధిలోని నరశింగపాలెం గ్రామానికి చెందిన చీటి నాగేంద్రరావు(53) గుండెపోటుతో సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లో మరణించారు. ఆయనకు భార్య, కుమార్తె కలరు. మంగళవారం ఆగిరిపల్లి మండలం నరశింగపాలెం గ్రామంలో పోలీసు లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. పోలీస్ శాఖలో ఎస్ఐగా, సిఐగా, అనంతరం డిఎస్‌పిగా అంచెలంచెలుగా ఎదుగుతూ ఆకస్మికంగా మృత్యువాత పడటంతో అతని కుటుంబసభ్యులు, గ్రామస్తులు, పోలీసు ఉన్నతాధికారులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎన్.చంటిబాబు, పోలీసు సిబ్బంది, పెద్ద ఎత్తున గ్రామస్తులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

ప్రజాశక్తి - ముదినేపల్లి

విధుల పట్ల వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పని ఎంపిపి ఆర్.సత్యనారాయణ అన్నారు. ముదినేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం మంగళవారం సాయంత్రం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాలన్నారు. విధులపట్ల నిర్లక్ష్యం వహించే వారిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు. ఆసుపత్రిని సందర్శించి వైద్య సిబ్బంది సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు మొట్రూ ఏసుబాబు, పిహెచ్‌సి వైద్యాధికారులు, ఎఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేద మహిళలకు చీరల పంపిణీ

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని వెంకటాపురంలో జగనన్న శారద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 250 మంది నిరుపేద మహిళకు చీరలను వైఎస్ఆర్ జిల్లా స్టీరింగ్ కమిటీ మాజీసభ్యులు, సీనియర్ నాయకులు తిరువీధుల శారద చేతుల మీదుగా పంపిణీ చేశారు. పార్టీలకు అతీతంగా జగనన్న శారద చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతోందని శారద అన్నారు. ఈ పంపిణీ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు గుడిపాటి శివ రామకృష్ణ, జి.మురళీకృష్ణ, ఆళ్ల సాయిబాబు, గంట వెంకయ్య, నంబూరి పాము, నాగబాబు పాల్గొన్నారు.



మహిళలకు చీరలందిస్తున్న శారద

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పండుగల ముసుగులో అసాంఘిక కార్యకలాపాలు, జూదాలకు పాల్పడితే ఎంతటి వారికైనా కఠిన చర్యలు తప్పవని రూరల్ సిఐ బాల సురేష్ హెచ్చరించారు. ఈ సందర్భంగా నూజివీడులో మంగళవారం ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరం, సంక్రాంతి వేడుకల ముసుగులో పేకాట, కోడి పందాలు నిర్వహించినా, కోడి కత్తులు తయారుచేసినా, కఠిన చర్యలు తప్పవు అన్నారు. ఇటువంటి వారి సమాచారం ప్రజలు తమకు అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని తెలియజేశారు.

ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలిగా ప్రసన్న నియామకం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి



ఆగిరిపల్లి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారిగా బి.ప్రసన్న నియమితులయ్యారు. వైద్యసేవలు అందించడం కోసం కమీషనర్ ఆదేశానుసారం ఆమె ఇక్కడకు వచ్చారు. బుధవారం నుంచి ఆగిరిపల్లి వైద్యశాలలో సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు.